ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





చంద్రబాబును సత్కరిస్తున్న మంత్రులు బీసీ, ఫరూక్, ఎంపీ, ఎమ్మెల్యేలు



అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..!

- వ్యవసాయ ఆధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు
- సీమలో కరువు లేకుండా చేస్తాం ● నీటిని కాపాడుకోవటం మన బాధ్యత
- శ్రీశైలం పర్యటనలో సీఎం నారా చంద్రబాబు నాయుడు

శ్రీశైలం/నంద్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి.. ఆ సంపదను పేదలకు పంచి అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించడమే తన లక్ష్యమని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రతి చుక్క నీటిని ఒడిసి పట్టి రాయలసీమకు నీరు అందించి ఈ ప్రాంతంలో కరువు లేకుండా చేస్తానని, వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. శ్రీశైలం పర్యటనలో భాగంగా సుండిపెంట 'మన నీరు - మన సంపద' కార్యక్రమంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్స్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 'నీరు చాలా విలువైనది. నీరు ఉంటే సాగు జరుగుతుంది. ఆహార ఉత్పత్తి నిండుగా వస్తుంది. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు అందించి ఉద్యాన తోటలు, పండ్ల తోటలు పండిస్తే రాయలసీమ రతనాల సీమ అవుతుంది. అన్ని రిజర్వాయర్లలో నీటిని పొదుపు చేసి వాటిని సద్వినియోగం చేసేలా డ్రిప్ ఇరిగేషన్ పెంచి నీటి వృథాను అరికట్టాలి. రాయలసీమలో నాలుగు ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. హైడ్రో విండ్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నా. అందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాం..' అని అన్నారు.

మల్లన్న స్వామి అనుగ్రహం లభించింది


స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి వస్తున్నానని, కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని చంద్రబాబు అన్నారు. 20 ఏళ్ల తరువాత జూలైలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండిందని.. ఇదంతా మల్లన్న స్వామి ఆశీస్సుల వల్లే అన్నారు. దివంగత ఎన్టీఆర్ రాష్ట్రానికి అనే సాగునీటి ప్రాజెక్టులు తీసుకువచ్చారని, కృష్ణా మిగులు జలాలు వాడుకోవచ్చన్నది ఆయన ఆలోచనేనని అన్నారు. ఎస్సార్బీసీ, గాలేరు, హంద్రీనీవా ప్రాజెక్టులు ఆయన మొదలు పెట్టినవేనని, దీనివల్ల రాయలసీమకు నీరు అందుతోందన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులు అన్ని నిండుతున్నాయని, నీటిని జాగ్రత్తగా వాడుకుంటే సాగు బాగా ఉంటుందని, రాయలసీమలోని ప్రతి ఎకరాకు నీరు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు.

మల్లన్న సన్నిధిలో చంద్రబాబు

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఉండవల్లి గ్రామం హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. తరువాత రోడ్డు మార్గాన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ప్రధానాలయం రాజగోపురం వద్దకు చేరుకున్నారు. ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రాలతో స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయం లోపలికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన రత్నగర్భ గణపతిని దర్శించుకుని మల్లికార్జున స్వామి, భ్రమరాంబదేవి అమ్మవారిని దర్శించుకుని అర్చనలు జరిపించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నారా చంద్రబాబుకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

- రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలక్షేత్ర పర్యటనలో భాగంగా స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం 12:30 గంటలకు శ్రీశైలం జలాశయం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ నీటిపారుదలకు సంబంధించి అన్ని ప్రాజెక్టుల ముఖచిత్ర మ్యాప్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలించారు. శ్రీశైల జలాశయం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి సాగునీటి ప్రాజెక్టుల వివరాలను సీఎంకు నివేదించారు. ప్రాజెక్టు పరిశీలన అనంతరం కృష్ణా నదికి జల హారతి ఇచ్చారు.
- కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రాయలసీమ ప్రాంతానికి దాదాపు రూ. 4 వేల కోట్ల రూపాయలను కేటాయించిందని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు రాయలసీమకు ఎగువన ఉందని, శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువన సిద్ధేశ్వరం వద్ద ఐకానిక్ బ్రిడ్జి మంజూరు అయిందని, ఇక్కడ బ్రిడ్జితో పాటు బ్యారేజి నిర్మిస్తే 60 టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోవచ్చని సీఎం చంద్రబాబును కోరారు. ఇందుకు చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారు.
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్ల వ్యవధి అనంతరం జూలై మాసంలో శ్రీశైలం జలాశయం నిండటం శుభదాయకమన్నారు. పట్టిసీమ ఏర్పాటు చేసి రాయలసీమకు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. సుండిపెంట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గతంలో రూ. 17 కోట్ల మంజూరు చేశారని అన్నారు. తాగు నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, కోట్ల జయప్రకాశ్‌రెడ్డి, గిత్త జయసూర్య, ఎమ్మెల్సీలు, నాయకులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు వివరాలను వివరిస్తున్న ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి

కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న చంద్రబాబు

చంద్రబాబుతో డోన్ ఎమ్మెల్యే కోట్ల

చంద్రబాబుతో సోమిశెట్టి వెంకటేశ్వర్లు

వాహనంలో ప్రయాణిస్తూ...



ఆలయంలో బైరెడ్డి శబరి, చంద్రబాబు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి



సీఎం చంద్రబాబుతో శ్రీశైలం ఆలయ అర్చకులు, అధికారులు



శ్రీశైలం డ్యాం వద్దకు వెళ్తున్న చంద్రబాబు, కలెక్టర్ రాజకుమారి



చంద్రబాబును చూసేందుకు..



చంద్రబాబు వెంట టీడీపీ నేతలు మాండ్ర, బుడ్డా, బీసీ



సుండిపెంటలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న చంద్రబాబు

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, ఆగస్టు 1: రాయలసీమ ప్రజల ఆశలను, ఆకాంక్షలను గౌరవించి సీఎం నారా చంద్రబాబు నాయుడు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంపై కార్యాచరణ ప్రకటించినందుకు రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలోని సమితి కేంద్ర కార్యాలయంలో బొజ్జా మాట్లాడారు. రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని ప్రపంచ దృష్టికి తీసుకుపోవడానికి, శ్రీశైలం రిజర్వాయర్‌లో రాయలసీమకున్న నీటి హక్కులను వినియోగించుకునే లక్ష్యంతో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకు స్థాపన చేపట్టిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం వలన శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరడం నివారించి శ్రీశైలం జీవిత కాలాన్ని పెంచుతుందన్న విషయాన్ని ప్రజా సంఘాలు విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఈ అలుగు నిర్మాణం వల్ల శ్రీశైలం ప్రాజెక్టుకు రక్షణగా ఉంటుందని ఇది తక్కువ ఖర్చుతో నిర్మించవచ్చునని, దీనికి భూ సేకరణ కూడా అవసరం లేదన్న విషయాన్ని ప్రజల ముందు ఉంచడంలో రాయలసీమ ప్రజాసంఘాలు పని చేశాయని తెలిపారు. కల్వకుర్తి-నంద్యాల మధ్యన నిర్మిస్తున్న జాతీయ రహదారిలో భాగంగా సిద్ధేశ్వరం వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జితో పాటుగా రాయలసీమ ప్రాంత నీటి అవసరాలను తీర్చడానికి అలుగు నిర్మాణం చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి సాధిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు బొజ్జా పేర్కొన్నారు.



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

గంటల్లోనే నందికొట్కూరు సీఐ మార్పు

నందికొట్కూరు, ఆగస్టు 1: నందికొట్కూరు రూరల్ సీఐ బదిలీల మార్పు చర్చనీయాంశంగా మారింది. ముందుగా నందికొట్కూరు రూరల్ సీఐగా సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అర్ధరాత్రి సుధాకర్‌రెడ్డిని నంద్యాల జిల్లా వీఆర్‌కు పంపుతూ బి.ఆర్.కృష్ణయ్యను నందికొట్కూరు రూరల్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గంటల వ్యవధిలో నందికొట్కూరు రూరల్ సీఐ మార్పు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అధికారపార్టీలోని నాయకుల మధ్య ఆధిపత్య పోరులో అధికారులు పావుగా మారినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.



బి.ఆర్. కృష్ణయ్య

రూ.2.3 లక్షల పింఛన్ సొమ్ము స్వాహా

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్యాపిలి, ఆగస్టు 1: ఓ సచివాలయ ఉద్యోగి పేదలకు పంపిణీ చేయాల్సిన రూ.2.3 లక్షల పింఛన్ డబ్బును స్వాహా చేశాడు. సదరు ఉద్యోగిపై గురువారం ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని వెంగళాంపల్లి సచివాలయంలో పవన్ కుమార్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆగస్టు నెల పింఛన్లు పంపిణీ చేసేందుకు మండల పరిషత్ అధికారులు గత నెల 31న 50 పింఛన్లకు సంబంధించి రూ.2.3 లక్షలు పవన్‌కుమార్‌కు అందజేశారు. గురువారం సదరు ఉద్యోగి పింఛన్ పంపిణీ చేయడానికి గ్రామానికి వెళ్లలేదు. దీంతో గ్రామంలోని పలువురు ఎంపీడీవో సాయిమనోహర్‌కు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో సచివాలయ ఉద్యోగికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆయన ప్యాపిలిలోని ఆయన ఇంటికి సిబ్బందిని పంపించారు. ఇంట్లో కూడ లేకపోవడంతో ఎంపీడీవో సాయిమనోహర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉద్యోగిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. తన అప్పులు కట్టడానికి డబ్బును వాడుకున్నట్లు ఉద్యోగి ఒప్పుకున్నారు. దీంతో అధికారులు, పోలీసులు కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన కాజేసిన సొమ్మును రికవరీ చేశారు. ఎంపీడీవో ఫిర్యాదు మేరకు సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మురిపించన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 1: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో భాగంగా పేద ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవితాన్ని అందించే ఉద్దేశంతో చెప్పిన మాట ప్రకారం పింఛన్ల మొత్తాన్ని పెంచి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మేలు కలుగజేస్తుంది. అవ్వాతాతలతో పాటు, సంపాదన, ఆదరణ కరువైన వితంతు, చేనేత ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఏఆర్టీ పింఛన్‌దారులకు 1వ తేదీన చంద్రబాబు ప్రభుత్వం అందజేస్తోంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా 98.03 శాతంతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 2,43,337 పింఛన్లలో 2,38,540 పింఛన్లను అధికారులు పంపిణీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను శుక్రవారంలోపు పంపిణీ చేయనున్నారు.

- పెరిగిన పింఛన్‌తో సామాజిక భద్రత
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం
- పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా టాప్

వృద్ధాప్యంలో భరోసా



నా వయస్సు 75 సంవత్సరాలు నా భార్య వయస్సు 70 సంవత్సరాలు మేమిద్దరం వృద్ధులం. మేము ఏ పని చేసుకోలేని పరిస్థితుల్లో పింఛన్ డబ్బులు మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నాము. పోయిన ప్రభుత్వంలో మాకు వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు వచ్చేది. చంద్రబాబు నాయుడు వచ్చాక రూ.4 వేలు వస్తోంది. చాలా సంతోషంగా ఉంది. గత నెలలో రూ.7వేలు తీసుకున్నాం.

- షేక్.మసీందార్ అజిత్ మియా, కండేరి వీధి,కర్నూలు

ఎన్టీఆర్ భరోసాతో కొండంత ఆసరా



2020 సంవత్సరంలో కరోనా సమయంలో మా భర్త కిడ్నీ ఫెయిల్యూర్‌తో చనిపోయాడు. అప్పటి నుంచి నేను టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం చేస్తున్నాను. నాకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో మాకు వితంతు పింఛన్ రూ.3వేలు వచ్చేది. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. **-అరుణ, చిదంబరరావు వీధి**

జిల్లాలో 2,43,337 మందికి లబ్ధి

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పథకం కింద జిల్లాలో ఆగస్టు నాటికి 2,43,337 మందికి రూ.103.54 కోట్లు లబ్ధి చేకూరింది. ఇందులో ఎక్కువగా వృద్ధాప్య పింఛన్లు 1,24,318 , వితంతు పింఛన్లు 71,303 మంది, దివ్యాంగ పింఛన్లు 31,340 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉదారగుణంతో 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులకు, డయాలసిస్ రోగులకు, పీఎల్‌హెచ్ఐవీ (ఏఆఆర్‌టీ) కుటుంబాలలో ఒకటి కన్నా పింఛన్లకు అనుమతి మంజూరు చేయడం జరుగుతోంది.

- మా పాలిట చంద్రబాబు దేవుడు



నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడిని. 4 సంవత్సరాల కింద ప్రమాదంలో నాకు వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమయ్యా. గత ప్రభుత్వంలో రూ.5వేలు పింఛన్ తీసుకున్నా. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ.15వేలు పింఛన్ అందించాడు. ఈ డబ్బుతో నేను చికిత్స చేయించుకుంటున్నాను. సీఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉన్నా.

- మహ్మద్ యూసుఫ్, కండేరి వీధి

రూ.103.54 కోట్ల పింఛన్లు పంపిణీ



వరలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్

కల్లూరు, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,43,337 వివిధ రకాల లబ్ధిదారులకు రూ.103.54 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఉదయం 6 గంటలకే కలెక్టర్ కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చేరుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అర్హులైన మస్తాన్‌బీ, లక్ష్మీదేవి, వరలక్ష్మిలకు వితంతు పింఛన్లు, రామాంజనేయులుకు వృద్ధాప్య పింఛన్ వారి ఇంటి వద్దకే వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తొలిరోజే 100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని, ఒకటి, అరా మిగిలిపోతే రెండో రోజున పూర్తి స్థాయిలో పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, కల్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివరాం పాల్గొన్నారు.

దిక్కులేని వారికి దేవుడయ్యాడు : వరలక్ష్మి, కల్లూరు, చిన్నటేకూరు

నా భర్త కొన్ని సంవత్సరాల కింద మరణించారు. అప్పటి నుంచి ఏదో ఒక పని చేసుకుంటూ జీవిస్తున్నాను. కొంత కాలం నుంచి ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్దనే ఉంటున్నా. గతంలో ఇచ్చే పింఛన్ వైద్యానికి, మందులకు సరిపోయేది కాదు. అటువంటి సమయంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ. వేయి పెంచి రూ.4 వేలు పింఛన్ ఇంటి వద్దకే స్వయంగా కలెక్టరే వచ్చి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. సీఎం దిక్కులేనివారికి దేవుడయ్యాడు.

చిన్నటేకూరులో రామాంజనేయులుకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా



ఆర్థిక సమస్యలు తీరుతాయి

నాకు ఒక కుమారుడు ఉన్నాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోడానికి అతని సంపాదన సరిపోవడం లేదు. నా మందులకు ఆర్థికంగా చాలా ఇబ్బంది ఉండేది. ఈ సమయంలో సీఎం చంద్రబాబు రూ.4వేలు పింఛన్ ఇవ్వడంతో ఆర్థికంగా కొన్ని సమస్యలు తీరుతాయి.

- రామాంజనేయులు, చిన్నటేకూరు.

గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేస్తా

డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్



డా.ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 1: గ్రామీణ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలను బలోపేతం చేస్తానని కొత్త డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ తెలిపారు. డీఎంహెచ్‌వోగా ఆయన గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, అతిసార, డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో విషజ్వరాలు పెరగకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే అనుచరుల నుంచి కాపాడండి

సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇచ్చిన బాధితురాలు

శ్రీశైలం, ఆగస్టు 1: నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అనుచరులు, గన్‌మెన్ నుంచి తమను కాపాడాలంటూ షబానా అనే మహిళ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటనలో ఉండగా ఆయనను కలిసి వినతి పత్రం అందించింది. తనది నంద్యాల మండలం కానాల గ్రామం అని, తన ఊరిలో సర్వే నంబరు 985లోని 44 సెంట్లు, అదే విధంగా ఇదే మండలంలోని రైతు నగర్‌లోని సర్వే నంబరు 285లోని 11 సెంట్ల భూమిని వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అనుచరులు బోయ భాస్కర్‌రెడ్డి, ఎన్ సుంకిరెడ్డి, గన్‌మెన్ చిన్ని కృష్ణ కబ్జా చేయటమే కాకుండా, తనపై దాడి చేశారని, ఈ విషయంపై అప్పటి ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆమె తెలియజేసింది. తమకు న్యాయం జరగకపోవటంతో గతంలో ఆత్మహత్యాయత్నం చేశానని, టీడీపీ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరింది.

పేదల సొంతింటి కల చంద్రబాబుతోనే సాధ్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), ఆగస్టు 1: పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో శ్మశానాలు, వాగులు, వంకల్లో చాలీచాలని సెంటు స్థలం కేటాయించి పేదలకు ఇళ్లు లేకుండా చేశాడన్నారు. గతంలో టీడీపీ నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. వైసీపీ పాలనలో అన్ని శాఖల్లో ఆస్తులు తనఖా పెట్టి అప్పులు మిగిల్చారనీ ధ్వజమెత్తారు. భూముల సేకరణ పేరుతో వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారే తప్ప పేద ప్రజలకు ఇచ్చింది శూన్యమని మండిపడ్డారు.

● జిల్లాలో శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి కలిసి జిల్లాలోని తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితులను వివరించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించిన నిర్మాణాలను కొందరు దుండగులు ధ్వంసం చేశారనీ వాటి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబును కోరారు.

వేరుశనగ క్వింటం రూ.6,929

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 1: ఆదోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగ ధర రికార్డ్ స్థాయిలో పలుకుతున్నాయి. గత వారంతో పోల్చితే వేరుశనగ ధర క్వింటానికి రూ.600పైగా పెరిగింది. బోరు బావులు, కాలువల కింద రైతులు సాగు చేసిన వేరుశనగ దిగుబడి ఇప్పుడిప్పుడే చేతి అందుతుందని రైతులు ధర ఆశాజనకంగా ఉండడంతో వేరుశనగను మార్కెట్లో విక్రయించుకునేందుకు భారీగా తీసుకొస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోని ఆశించిన స్థాయిలో ధరలు ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 1,885 వేరుశనగ బస్తాలు విక్రయానికి రైతులు తీసుకురాగా వాటి కనిష్ట ధర క్వింటాలు రూ.3,900 గరిష్ట ధర రూ.6,929, మధ్యస్థ ధర రూ.6,419 పలికింది.

తుంగభద్రకు పోటెత్తిన వరద

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద పోటెత్తుతోంది. గత వారం పది రోజులుగా కొనసాగుతున్న వరద మరింత ఉధృతంగా మారుతోంది. కర్ణాటకలోని పడమటి కనుమల్లో కురుస్తున్న వర్షాలకు తుంగా, భద్ర, వరద నదులు పొంగి పొర్లుతున్నాయి. తుంగభద్రకు భారీగా వరద వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠనీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, గురువారం రాత్రి 9 గంటల సమయంలో 2,01,636 క్యూసెక్కులు డ్యాంకు వరద వచ్చి చేరుతోంది. 1631.02 అడుగుల్లో 97.945 టీఎంసీలు నిల్వ చేసి 1,79,936 క్యూసెకులు నదికి విడుదల చేస్తున్నారు. అదే క్రమంలో సుంకేసుల బ్యారేజీకి 1.51లక్షల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వచ్చిన వరదను వచ్చినట్లుగా శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.



గురువారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో తుంగభద్ర ప్రాజెక్టు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్

- టీడీపీకి మద్దతుగా ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లు...
- ఒక్క ఓటుతో టీడీపీ కార్పొరేటర్ జక్కల రమణమ్మ ఓటమి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 1: నగర పాలక సంస్థకు జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ మద్దతుగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంతో ఉత్కంఠగా సాగిన స్థాయి సంఘం సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం నూతన కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12.30 గంటలకే 98.03 శాతం నమోదైంది. ఐదు స్థానాలకు 10 మంది పోటీ పడిన విషయం తెలిసిందే. మూడు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 52 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇందులో 42వ వార్డు కార్పొరేటర్ కాశిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఓ కేసులో జైలుకు వెళ్లారు. అంతే కాకుండా 27వ వార్డు కార్పొరేటర్ పల్లె శారద విదేశాల్లో ఉండటంతో ఓటు వేయలేకపోయారు. మొత్తం 51 మందికి గాను 50 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెవెన్యూ ఆఫీసర్ జునైద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ ఇజ్రాయేల్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, రామక్రిష్ణ, ఉద్యోగులు తిమ్మప్ప, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన వైసీపీ కార్పొరేటర్లు: విక్రమసింహారెడ్డి (40 వార్డు), క్రాంతికుమార్ (12వ వార్డు)జుబేర్ అహ్మద్ (7వ వార్డు) చిట్టెమ్మ మిద్దె(31వ వార్డు) యూనుస్ బాషా(10వ వార్డు). వీరందరికి కమిషనర్ పివి. రామలింగేశ్వర్ నియామకపత్రాలను అందజేశారు. గెలిచిన సభ్యులు రానున్న ఏడాది పాటు స్టాంగింగ్ కమిటీ సభ్యులుగా ఉంటారు. నగరపాలక సాధారణ నిధులకు పది నుంచి యాభై లక్షల అభివృద్ధి పనులకు వీరి ఆమోదం తప్పనిసరి.

టీడీపీకి ఓటేసిన వైసీపీ కార్పొరేటర్లు: ఒక్కో కార్పొరేటర్ ఐదుగురికి ఓటు వేయాలి. దీంతో ఈ లెక్కన మొత్తం టీడీపీ కార్పొరేటర్‌కు తన ఓటుతో కలిపి 18 ఓట్లు మాత్రమే రావాలి. ఈ క్రమంలో టీడీపీ 24వ వార్డు కార్పొరేటర్ జక్కల రమణమ్మకు 25 ఓట్లు, 16వ వార్డు కార్పొరేటర్ విజయకుమారికి 24 ఓట్లు, 3వ వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్‌కు 20 ఓట్లు, 6వ వార్డు కార్పొరేటర్ నీలోఫర్ షేక్‌కు 19 ఓట్లు, 15వ వార్డు కార్పొరేటర్ శివమ్మకు 18 ఓట్లు వచ్చాయి. దీంతో జక్కల రమణమ్మకు 7 ఓట్లు, విజయకుమారికి 6 ఓట్లు, పర్వీన్‌కు 2 ఓట్లు, నీలోఫర్‌కు ఒక్క ఓటును వైసీపీ కార్పొరేటర్లు వేశారు. దీంతో జక్కల రమణమ్మ ఒక్క ఓటుతో పరాజయం పొందారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ పివి. రామలింగేశ్వర్

కూటమి కొట్లాటతో విద్యార్థుల పస్తు

- పాఠశాలలో అన్నం వండినా... విద్యార్థులకు వడ్డించని వైనం...
- ఆదోని మండలంలో చాలా పాఠశాల్లో ఇదే దుస్థితి...
- మధ్యాహ్న భోజనానికి సమస్యగా కూటమి కొట్లాటలు

ఆదోని రూరల్, ఆగస్టు 1 : ఉపాధ్యాయులు రాజకీయాలతో కూటమి కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే విషయంలో గొడవలకు దిగారు. దీని వల్ల విద్యార్థులకు పస్తు ఉండక తప్ప లేదు. మండలంలోని గణేకల్లులో కూటమి అధికారం చేపట్టిన తరువాత కూటమి నాయకుల సమక్షంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే బాధ్యతను గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హనుమంతరెడ్డికి జూలై 1నుంచి అప్పగించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొండయ్య వచ్చి ఎమ్మెల్యే పార్థసారథి తనకు లెటర్ ఇచ్చారని, పాఠశాలలో వంట తాను వండుతానని ఉపాధ్యాయులకు చెప్పాడు. టీడీపీ వాళ్లు ఆగస్టు 1వ తేది నుంచి వంట చేయడానికి వీల్లేదని చెప్పాడు. గురువారం కొండయ్య వంట చేయడానికి వెళ్లే సరికి టీడీపీ కార్యకర్త హనుమంతరెడ్డి పిల్లల కోసం సాంబరు బాత్ సిద్ధం చేశాడు. ఈ క్రమంలో టీడీపీ, బీజేపీ కార్యకర్తల మధ్య గంటల తరబడి పాఠశాల ఆవరణలో ఘర్షణ జరిగింది. అప్పటికే 12గంటలు దాటడంతో విద్యార్థులు ఇంటికెళ్ళి భోజనం చేసి రావాలని ఉపాధ్యాయులు చెప్పి, వాళ్లను బయటకు పంపి పాఠశాలకు గేట్లు వేసేశారు. పాఠశాలలో 1నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 506 మంది ఉన్నారు. వీరిలో 389మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ గొడవ వల్ల భోజనం వండినా... విద్యార్థులకు పెట్టకుండా ఉపాధ్యాయులు రాజకీయం చేసి విద్యార్థులను ఇంటికి పంపించారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దహరివాణం, ఇస్వీ, హనవాళ్‌తోపాటు తదితర గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కూడ ఇదే దుస్థితి దాపురించింది.

వండిన అన్నం పిల్లలకు పెట్టొద్దన్నారు

నెల క్రితం కూటమి నాయకులంతా కలిసి జూలై 1నుంచి హనుమంతురెడ్డి పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ చూసుకుంటాడని చెప్పారు. అయితే ఆగస్టు 1 నుంచి తాను వంట చేస్తామని కొండయ్య ఎమ్మెల్యే లెటర్ తీసుకొచ్చాడు. గురువారం హనుమంతరెడ్డి మధ్యాహ్న భోజనం తయారు చేశాడు. ఆ భోజనాన్ని పిల్లలకు పెట్టకూడదని కొండయ్య చెప్పడంతో పెట్టలేకపోయాం. నేటి నుంచి అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటాం.

ఇబ్రహీం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గణేకల్లు



బడిలో అన్నం పెట్టకపోవడంతో ఇంటికెళ్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

ఆదోని, ఆగస్టు 1: ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్ ఇంట్లో చోరీ జరిగింది. గత నెల 2వ తేదీన బాధితుడు వీరచంద్ర యాదవ్ మామ ఆరోగ్యం బాగా లేకపోతే డోన్ పట్టడానికి ఇంటికి తాళం చేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. బుధవారం సాయంత్రం చూడగా బీరువా తాళాలను పగలగొట్టి బీరువాలోని బట్టలు వస్తువులన్నీ బయట వేసి అందులో దాచిన రూ.1.40లక్షల నగదుతో పాటు మూడు తులాల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలో వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోపి తెలిపారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్టు

- మరో నిందితుడి కోసం గాలింపు



నిందితులను అరెస్ట్ చేసి చూపుతున్న పోలీసులు

గూడూరు, ఆగస్టు 1: గూడూరు పట్టణంలో సంచలనం రేపిన బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ కేసులో ఇద్దరి నిందితులను అరెస్టు చేసామని, మరో నిందితుడితోపాటు వీరికి సహకరించిన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య వెల్లడించారు. గురువారం గూడూరు పోలీసు స్టేషన్ ఆవరణలో బంగారు నగర వ్యాపారి డమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ గత నెల 29 మధ్యాహ్నం గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లును ఎమ్మిగనూరు రోడ్డులో దాల్ మిల్ షట్టర్ల దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు స్కార్పియో వాహనంలో కిడ్నాప్ చేశారని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిందితులను పట్టుకొనేందుకు టీంలను ఏర్పాటు చేశామన్నారు. కిడ్నాప్‌లో పాల్గొన్న మూడో వ్యక్తిని పట్టుకోడానికి గాలిస్తున్నట్లు తెలిపారు.

డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను

ఉత్పత్తి చేయండి

జెన్‌కో అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం



పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

శ్రీశైలం, ఆగస్టు 1: శ్రీశైలం హైడెల్ పవర్ ప్రాజెక్టు ద్వారా డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచుకునే సౌలభ్యం ఉందన్నారు. శ్రీశైలం జలాశయం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం కుడి హైడెల్ పవర్ కేంద్రాన్ని సందర్శించి జెన్‌కో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలని అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెన్యుబల్ ఎనర్జీకి కీలక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు, డైరెక్టర్ సుజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఇంజనీర్లను నియమించండి

- పదోన్నతులపై ప్రజాభిప్రాయ సేకరణ
- ఇరిగేషన్ అడ్మిన్ శ్రీనివాస్

కర్నూలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఇంజనీర్ల పదోన్నతులపై ఆ శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) శ్రీనివాసులు గురువారం అభిప్రాయ సేకరణ చేపట్టారు. జోన్-4 పరిధిలోని ఇంజనీర్లతో సీఈ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదోన్నతుల మీద ఇంజనీర్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎఫ్ఏసీల పేరుతో జూనియర్లను కూడా ఉన్నత స్థానాల్లో నియమించి సీనియర్ ఇంజనీర్లను అవమానిస్తున్నారనీ, ఎఫ్ఏసీలను రద్దు చేసి రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులను నియమించాలని పలువురు ఇంజనీరింగ్ అధికారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే జోన్-2, 3 పరిధిలో అభిప్రాయాల సేకరణ పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలో 2016లో ఇంజనీర్లకు పదోన్నతులు ఇస్తే తెలంగాణ హైకోర్టు దానిని రద్దు చేసిందన్నారు. ఇప్పటి వరకు పదోన్నతులు లేకపోవడంతో ఇంజనీర్లు చాలా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ముగ్గురు ఈఎన్‌సీలు, 15 మంది సీఈలు, 50 మంది ఎస్ఈలు, దాదాపు 170 మంది ఈఈలు జలవనరుల శాఖలో ఫుల్ అడిషినల్ పేరిట ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారనీ అన్నారు. ఇంజనీర్ల అభిప్రాయ సేకరణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు.

ఇంటి వద్దకే పింఛన్

● పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులు

● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు

పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం దిగ్విజయంగా ముగిసింది. ఉదయం నుంచే సచివాలయ ఉద్యోగులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హాజరైన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకుల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పంపిణీ చేసిందని అన్నారు.



పాములపాడు: ఎర్రగూడూరు గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు, ఆగస్టు 1: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో గురువారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు అవ్వాతాతలకు ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టిన వెంటనే మూడువేల పింఛన్ నాలుగు వేలకు పెంచి ఒకటో తేదీన అందించి వారి జీవితాల్లో సంతోషాలను నింపిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు గత వైసీపీ పాలనలో దాచుకోవడం తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, మంగమ్మబాయి, నాగార్జునరెడ్డి, చంద్రశేఖర్, గోవింద్, మధుకృష్ణ, హఫీజ్, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలో ఎన్టీఆర్ ఫించన్ పంపిణీ 97 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో కవిరాజ్ తెలిపారు. మండలంలో 4912 మందికి గానూ 4762 మందికి అందజేసినట్లు తెలిపారు. మిగిలిన ఫించన్లను శుక్రవారం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నెహ్రూనగర్ గ్రామంలో టీడీపీ నాయకుడు కె.హేమసుందరరాజు, పింఛన్ పంపిణీ పర్యవేక్షణాధికారి సుభాన్ లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఫరూక్‌బాషా, పంచాయతీ కార్యదర్శి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక బీసీ కాలనీ, చెంచుకాలనీ, బస్టాండు ప్రాంతాలలో పాణ్యం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సచివాలయ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మహబూబ్ బాషా, రవి, కృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం వేకువ జామున 5 గంటల నుంచే ప్రారంభమైంది. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అధికారులు, టీడీపీ నాయకులు పింఛన్‌లు పంపిణీ చేశారు. మండలంలో 5,763 పింఛన్‌లు ఉండగా 98 శాతం పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివరామిరెడ్డి తెలిపారు. పింఛన్‌ల పంపిణీ అనంతరం



గడివేముల: దుర్వేసి గ్రామంలో..

అవ్వా, తాతల కళ్లలో ఆనందం చూస్తున్నామని పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పంట రామచంద్రారెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, కంది శ్రీనులు అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు అని అన్నారు.

బండిఆత్మకూరు: మండలంలో పింఛన్ పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. సంతజూటూరులో సర్పంచ్ రామచంద్రుడు, కార్యదర్శి వెంకటరాముడు చేతుల మీదుగా పింఛన్ పంపిణీ చేశారు. నాగభూషణం అనే వ్యక్తి కృత్రిమ కాలుతో జీవన సాగిస్తున్నారు. గతంలో ఆయనకు రూ.5 వేలు పింఛన్ వచ్చేది. ప్రస్తుతం పింఛన్ రూ.15 వేలు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, చెన్నయ్య దేవేంద్రరెడ్డి, భారతి, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలంలో 95 శాతం మందికి పింఛన్ పంపిణీ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనారోగ్యంతో నంద్యాల, కర్నూలులో ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సిబ్బంది అందజేశారు. గాజులపల్లి ఆర్ఎస్‌లోని చెంచుకాలనీలో గిరిజనుల వద్దకు పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, తిలక్‌తో పాటు మండల ఇంజనీరింగ్ అధికారి రాముడు స్వయంగా వెళ్లి పింఛన్ అందజేశారు.

గోస్పాడు: మండలంలో 97 శాతం మందికి పింఛన్ పంపిణీ చేశారు.



గోస్పాడు మండలంలోని ఒంటివెలగల గ్రామంలో..



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో..

తేళ్ళపూరిలో టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఒంటివెలగలలో మాజీ సర్పంచ్ శీలం వీరారెడ్డి, వివిధ గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.



బండిఆత్మకూరు మండలంలోని సంతజూటూరులో..



మహానంది: గాజులపల్లి ఆర్ఎస్ గ్రామంలో..

సీఎం పర్యటన విజయవంతం



'మన నీరు మన సంపద' కార్యక్రమంలో మాట్లాడుతన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

శ్రీశైలం, ఆగస్టు 1: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటన విజయవంతమైంది. గురువారం ఉదయం ఉండవల్లి గ్రామం హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు 10:40 చేరుకున్నారు. అక్కడి నుంచి శ్రీశైలానికి రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలాకి 11:10 గంటలకు చేరుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి 12:30 గంటలకు శ్రీశైలం జలాశయం చేరుకుని రాలయసీమ నీటిపారుదలకు సంబంధించి అన్ని ప్రాజెక్టుల ముఖచిత్ర మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం కృష్ణా నదికి జల హారతి ఇచ్చి కృష్ణమ్మకు చీర సారె నీటిలో వదిలి వాయినం సమర్పించారు. తరువాత అక్కడి నుంచి సుండిపెంటలో వాటర్ యూజర్స్ అసోసియేషన్స్‌తో ఏర్పాటు చేసిన 'మన నీరు మన సంపద' కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిన అనంతరం సుండిపెంట హెలిప్యాడ్ చేరుకుని మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో అనంతపురం జిల్లాకు బయలుదేరి వెళ్లారు.

తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

ఆత్మకూరు: శ్రీశైలం పర్యటనలో భాగంగా గురువారం సున్నిపెంటలో ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు సభకు తెలుగుతమ్ముళ్లు ఆత్మకూరు నుంచి భారీగా తరలివెళ్లారు. ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయం నుంచి రెండు ప్రత్యేక బస్సుల్లో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈసందర్భంగా టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలీముల్లా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా సీఎం చంద్రబాబు శ్రీశైలానికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. చంద్రబాబు పర్యటనతో శ్రీశైల నియోజకవర్గం అన్నివిధాలుగా అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు.

వెలుగోడు: శ్రీశైలం పర్యటన కోసం సీఎం చంద్రబాబునాయుడు గురువారం వచ్చారు. ఆయన పర్యటనలో పాల్గొనేందుకు వెలుగోడు మండలంలో నుంచి పలువరు టీడీపీ నాయకులు ప్రత్యేక బస్సులో స్థానిక టీడీపీ కార్యాలయంల నుంచి తెల్లవారురుఝామున బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అన్నారపు శేషిరెడ్డి, అమీర్‌హంజా, సుధాకరరెడ్డి, సుంకిరెడ్డి, భూపాల్‌చౌదరి తదిరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలు

మహానంది, ఆగస్టు 1: మహానంది క్షేత్రంలోని నందీశ్వరుడి విగ్రహానికి గురువారం ఘనంగా ప్రదోషకాల పూజలునిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలతో గణపతి పూజ, పుణ్యాహవాచనంతో పాటు పంచద్రవ్య పూజ, పీఠార్చన, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి సారె



ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

వెలుగోడు, ఆగస్టు 1: వెలుగోడు పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు చీర, సారె సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టనంలోని ఆర్యవైశ్య మహిళలు భక్తి శ్రద్ధలతో చీర, సారె తీసుకుని పురవీధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి చీర సారె నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు

గడివేముల, ఆగస్టు 1: మండలంలోని కరిమద్దెల హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మోహిని 46వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీలకు, సాయిమణి రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు తెలిపారు. 46వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీలు ఈనెల 17, 18 తేదీలలో సత్య సాయి జిల్లాలోని కదిరి పట్టణం ఎస్‌వీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని అన్నారు. సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహణ తేదీలు ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను టీడీపీ నాయకులు అంబటి శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మాతృభూమికి కళార్చన' సాంస్కృతిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు, నిర్వాహకులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 1: కళారాధన, నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో దేశ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం మాతృభూమికి కళార్చన పోటీలను ప్రారంభించారు. వివేకానంద ఆడిటోరియంలో ప్రారంభమయిన ఈ పోటీలను కళారాధన అధ్యక్షులు డా. మధుసూదనరావు, డా. రామక్రిష్ణారెడ్డి, డా.రవిక్రిష్ణ లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవిక్రిష్ణ మాట్లాడుతూ కళారాధన రజతోత్సవంలో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో భాగంగా గురువారం లఘు చలనచిత్ర విశ్లేషణ, చిత్రపట విశ్లేషణ తదితర పోటీలు నిర్వహించారు. ఈపోటీలు ఆగస్టు 15వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వతేదీన సాయంత్రం జరిగే ఉత్సవంలో పోటీలలోని విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవిప్రకాష్, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిజాముద్దీన్, రమేష్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌లో 6 టీఎంసీల నీరు

వెలుగోడు, ఆగస్టు 1: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయంలో నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 6 టీఎంసీలకు చేరుకుంది. బానకచెర్ల సముదాయం నుంచి 18125 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగ ఆజలావయం నుంచి వన్‌ఆర్ తూము ద్వారా 30 క్యూఎక్కుల నీరునంద్యాల తాగునీటి కోసం 15 క్యూసెక్కుల నీరు, దిగువ ప్రాంతాలకు విడుదలచేస్తున్నారు. రోజురోజుకు నీటి మట్టం పెరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జలాశయానికి సందర్శకులు తాకిడి అధిక మవుతోంది.

హంద్రీ నీవా ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



మల్యాల వద్ద గల హంద్రీ నీవా ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేస్తున్న అధికారులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 1: మల్యాల వద్ద గల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేశారు. గురువారం నందికొట్కూరు మండలంలోని మల్యాల వద్ద గల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపెతల పథకం నుంచి రెండు పంపుల ద్వారా 675 క్యూసెక్కుల నీటిని నీటి పారుదల శాఖాధికారులు ఎస్ఈ రాంగోపాల్, ఈఈ సురేష్‌రెడ్డి, డీఈ చిన్నయ్య, ఏఈ మహేంద్రారెడ్డి ముందుగా శాస్త్రోక్తంగా క్రిష్ణవేణి నదీ జలాలకు పూజలు నిర్వహించారు. అనంతరం 8, 9 పంపుల ద్వారా 675 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటివిడుదల చేశామని, అయితే జాతీయ రహదారి 340సి పనుల వల్ల హంద్రీ కాలువలో నీరు వెళ్లడానికి తీవ్ర అంటంకం ఏర్పడుతుందని మరలా నిలిపి వేసినట్లు తెలిపారు. బ్రాహ్మణకొట్కూరు సమీపంలో కేజీ రోడ్డుపై జాతీయ రహదారి పనులు చేస్తూ హంద్రీ కాలువలో మట్టి నింపి డైవర్షన్ రోడ్డు వేశారు. దానిని యుద్ద ప్రాతిపదికన తొలగించి నీరు వెళ్లడానికి పైపులు వేశారు కానీ అవి పూరిగ్గా నీటిని వెళ్లనివ్వడం లేదని అధికారులు నీటి పంపింగ్ నిలిపి వేశారు. అయితే పలుచోట్ల సమస్యలను అధికారులు పరిష్కరించి తిరిగి రాత్రికి నీటిని విడుదల చేశారు.

'సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నందికొట్కూరు, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి రాఘవయ్య అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి రాఘవయ్య, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి సోలోమోన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ నెరవేరిందంటూ, బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. పట్టణంలో ర్యాలీలు చేపట్టి బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తాలుకా నాయకులు శేఖర్, గిడ్డయ్య, తిరుపాలు, రాజు, మోహన్, కళాకర్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన

పాములపాడు, ఆగస్టు 1: వరిపంటలో సేంద్రియ వ్యవసాయంలో బీజామృతంతో విత్తనశుద్ధి, సూడమొనాసిస్‌తో శుద్ధిపై రైతులకు నంద్యాల జిల్లా రైతు శిక్షణ కేంద్రం వవ్యసాయశాఖ అధికారి హేమలత, మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని వేంపెంట గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో బాగంగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన అధిక పంటలు పండించి మిగతా రైతులకు ఆదర్శంగా నిలవడంతో ఈ గ్రామాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మద్దిలేటి, సిబ్బంది గాయిత్రి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'నిధులు సద్వినియోగం చేసుకోవాలి'

బండిఆత్మకూరు, ఆగస్టు 1: బండిఆత్మకూరు పీహెచ్‌సీకి నిర్వహణ కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. గురువారం డాక్టర్లు భావన, సవిత అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రూ.87 వేల నిధుల ఖర్చుపై చర్చించారు. ప్రాధాన్యత కలిగిన పనులకు నిధులు ఖర్చు చేయాలని తీర్మానించారు. సర్పంచ్ సంధ్య, ఎంపీడీవో విజయరావు, ఏవో హనీఫ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ వెంకట శివ పాల్గొన్నారు.

ఒకే రోజు ఆరు దుకాణాల్లో చోరీ

● ఆందోళనలో ప్రజలు



గోరుకల్లులో చోరీకి గురైన షాపు

పాణ్యం, ఆగస్టు 1: మండలంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం తెల్లవారుజామున గోరుకల్లులో జరిగిన చోరీలతో మరింత భయాందోళనలకు గరవుతున్నారు. గోరుకల్లులోని శివకుమార్‌కు చెందిన కిరాణం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి రూ. 20 వేలు నగదు, రూ.30 వేలు విలువైన సిగరెట్లు, సామగ్రి ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాలనాయుడుకు చెందిన షాపులో రూ.10 వేల విలువైన సామగ్రి సరుకులు ఎత్తుకెళ్లారు. ఆదిలక్ష్మికి చెందిన కూల్‌డ్రింక్ షాపులో రూ.10వేల విలువైన సామగ్రి ఎత్తుకెళ్లారు. పుల్లమ్మకు చెందిన షాపులో రూ.5వేల విలువైన సరుకులు ఎత్తుకెళ్లారు. రాజేష్‌కు చెందిన బార్బర్ షాపులో ట్రిమ్మర్లు తదితర సామానులు ఎత్తుకెళ్లినట్టు బాధితులు తెలిపారు. పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీకి గురైన షాపులను పరిశీలించినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. కాగా పదిరోజులు క్రితం పాణ్యంలోని రెండు షాపుల్లో దొంగలు రూ.40 వేల విలువైన సామాగ్రి, సరుకులు ఎత్తుకెళ్లినా ఇంత వరకు కేసు నమోదు కాకపోవడంపై బాధితులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. గోరుకల్లులో జరిగిన చోరీలపై బాధితులు గురువారం ఉదయం పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారని ఏఎస్ఐ రఫీక్ తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు మన్సూర్, సత్యం సంఘటనా స్థలాలను, కొండజూటూరు, కొట్టాలలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

సారా స్వాధీనం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 1: గడివేముల మండలం పులిమద్ది క్రాస్ రోడ్ వద్ద ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం పిలిమద్ది క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. బేతంచెర్ల మండలం బుగ్గాని పల్లె తాండా గ్రామానికి చెందిన భాస్కర్‌నాయక్ అనే వ్యక్తి తన బైక్‌పై 20 లీటర్ల నాటు సారా తరలిస్తుండగా భాస్కర్‌నాయక్‌ను అరెస్ట్ చేసి సారా, బైక్‌ను సీజ్ చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు మండల సమావేశం

పగిడ్యాల, ఆగస్టు 1: పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కవిరాజ్ తెలిపారు. వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరవుతారని చెప్పారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిదిలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

'ఉపాధ్యాయుడి సేవలు మరువలేనివి'



శంకర్‌ను సన్మానిస్తున్నఉపాధ్యాయులు

కొత్తపల్లి, ఆగస్టు 1: తెలుగు ఉపాధ్యాయుడు కమతం శంకర్ సేవలు మరువలేవని కొత్తపల్లి ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మంనాయక్, ఏపీజేఏసీ ప్రధాన కార్యదర్శి హృదయరాజు అన్నారు. దుద్యాల జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కృష్ణమోహన్ అధ్యక్షతన గురువారం కమతం శంకర్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి, అని అయితే వారు అంకితభావంతో చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. సర్పంచ్ శోభలత, విశ్రాంత ఎంఈవోలు శ్రీరాములు, జానకీరామ్, విశ్రాంత హెచ్‌ఎంలు వెంకటరమణ ఆచారి, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, సుధాకర్, ఆయూబ్, రమణయ్య, మాజీ ఎంపీపీలు వంగాల శివరామిరెడ్డి, వైవీ మోహనరెడ్డి, మక్బూల్, ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, బంధువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం'



ఆత్మకూరు రూరల్: బాపనంతాపురంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్



గోస్పాడు: తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

మహానంది, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహానంది మండలం అబ్బీపురం గ్రామంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ సావిత్రి ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు 6 నెలల పాటు పిల్లలకు తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యం అని తెలిపారు. మండలంలో 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, అంగన్‌వాడీ టీచర్ చంద్రలీల పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): తల్లిపాలు శిశువుకు శ్రేయస్కరమని ఐఎంఏ నంద్యాలశాఖ అద్యక్షురాలు డాక్టర్ వసుధారాణి అన్నారు. ప్రపంచ తల్లిపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాలలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో గురువారం సదస్సు ఏర్పాటు చేశారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలనికి డాక్టర్ వసుధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అవగాహన లోపాలతో శిశువులకు ముర్రుపాలు పట్టించడంలో తల్లులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ముర్రుపాలతో శిశువుకు వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సంవత్సరం వరకు తల్లులు పిల్లలకు పాలు పట్టాలని సూచించారు. దీని వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ ప్రగతి రెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

గోస్పాడు: శిశువు జన్మించినప్పుడే తల్లి ముర్రుపాలు ఇవ్వడం బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం గోస్పాడులో తల్లిపాల వారోత్సవాల గోడ పత్రికలను విడుదల చేశారు. 7వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు జరగనున్నాయి. ఈ వారోత్సవాలలో పిల్లల పట్ల తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భిణులులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: తల్లి పాలలో ఉండే పోషక విలువలతో శిశు మరణాలు తగ్గించవచ్చని, శిశు మరణాల నియంత్రణలో తల్లి పాలే శ్రేష్టమని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల ఆవశ్యకతపై బాపనంతాపురం గ్రామంల్లో తల్లులకు అవగాహన కల్పించారు. డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ..ప్రసవం జరిగిన వెంటనే తప్పనిసరిగా ముర్రుపాలను బిడ్డకు పట్టించాలని తద్వారా బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లి పాలలో 400 రకాల పోషక విలువలు ఉంటాయని, ఆరు నెలల పాటు బిడ్డకు అమ్మపాలు తాగిస్తే తల్లీబిడ్డలిద్దరి ఆరోగ్యానికి కలిగే మేలు గురించి వివరించారు. ముర్రుపాలతో శిశువుకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. సీహెచ్‌వో ఫాతిమా, హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

శ్రీశైలంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు చేయడానికి వెళ్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 1: శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె సోదరుడు విఖ్యాత్‌రెడ్డి గురువారం పూజలు చేశారు. వీరిని ఆలయ అధికారులు సాదరంగా ఆహ్వానించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు బాలికలు



రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలతో హెచ్ఎం, పీడీ

చాగలమర్రి, ఆగస్టు 1: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికలు వైరుతూ, సమీర రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ దాదాపీర్ గురువారం తెలిపారు. బాలికలు ఈనెల 31న కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 17 నుంచి శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టు తరపున పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన బాలికలను హెచ్ఎం కోటయ్య, పీఈటీ భారతీ, ఉపాధ్యాయులు అభినందించారు.

చాపాడు చానల్‌కు కేసీ నీరు విడుదల

చాగలమర్రి, ఆగస్టు 1: రాజోలి ఆనకట్ట వద్దగల చాపాడుచానల్‌కు గురువారం కేసీ కెనాల్ అధికారి జాన్సన్ గురువారం విడుదల చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాపాడు చానల్‌కు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఏఈ మాట్లాడుతూ చాపాడు చానల్‌కు రోజు వారీగా నీటి మట్టం పెంచుతామని చెప్పారు. చాపాడుచానల్ పరిదిలో 6 ఉప కాలువలు, 5 చెరువులు ఉన్నాయని అన్నారు. 18,452 ఎకరాల ఆయకట్టుకు కేసీ కాలువ ద్వారా నీరందిస్తామని అన్నారు. రైతులు వరి నాట్లు వేసుకునేందుకు వీలు కల్పించామన్నారు. పంట పూర్తయ్యే వరకు సాగునీరు అందిస్తామని అన్నారు. లస్కర్లు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

చాగలమర్రి, ఆగస్టు 1: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల కోసం గురువారం చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధి పాఠశాలలో ఎంఈవో అనూరాధ నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్‌ను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ఉంచాలని హెచ్ఎంలకు సూచించారు. హెచ్ఎం వరాలు, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

ఉయ్యాలవాడ: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలయినట్లు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఓటర్ల జాబితాను వారు ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ 1 నుంచి 8 తరగతుల వరకు ఉన్న పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరుపుతున్నామన్నారు. ఓటర్ల జాబితాను అన్ని ప్రభుత్వపాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో ఉంచామన్నారు.

ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించండి



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న బీసీ ఇందిరమ్మ

కోవెలకుంట్ల, ఆగస్టు 1: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పుస్తకల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ ఇందిరమ్మ హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనదన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో బీవీ ఫక్కీరారెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా జిల్లా పరిషత్ కో ఆప్షన్ మెంబరు ఎస్ఏ గఫూర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, ఎంఈవోలు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కుంగిన చెరువు గట్టు

ఆందోళనలో గ్రామస్థులు



కొండమాయపల్లె చిన్నరాజచెరువు వద్ద కుంగిన గట్టు

రుద్రవరం, ఆగస్టు 1: మండలంలోని కొండమాయపల్లె గ్రామంపైన చిన్నరాజ చెరువు ఉంది. పూర్వం నుంచి ఈ చెరువు గ్రామంపై భాగంలోనే రాజులు తాగునీరు, సాగునీటి కోసం నిర్మాణం చేపట్టారు. చెరువు గట్టుకు వంద నుంచి 200 మీటర్ల దూరంలో గ్రామం ఉంది. తూము వద్ద గట్టు కుంగి రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ గ్రామంలో సుమారు 250 నుంచి 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. చెరువు ఆయకట్టు నాన్ ఆయకట్టు సుమారు 250 ఎకరాల్లో ఉంది. ఈ చెరవుపైనే ఈ గ్రామం రైతులతో పాటు ఆర్.కొత్తూరు, రుద్రవరంలో కొంత భాగంమంది రైతులు ఆధారపడి భూములు సాగు చేస్తున్నారు.

కంది పంటపై జింకల దాడి



చాగలమర్రిలో కంది, పత్తి పంట మొలకలను తినేస్తేన్న జింకలు

చాగలమర్రి, ఆగస్టు 1: చాగలమర్రి గ్రామంలో రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలపై గురువారం జింకలు దాడి చేసి మొలకలను నాశనం చేశాయి. రైతులు కంది, పత్తి పంట విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేశారు. మొలకలు వచ్చిన సమయంలో జింకలు మందలు మందలుగా పొలాల్లో సంచరించి మొలకలు తినేసి నష్టం కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 100 ఎకరాల దాకా పంట మొలకలు దెబ్బతిని నష్టపోయామని రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులు జింకల బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేదలకు వరం'

కోవెలకుంట్ల, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛను పేదలకు వరమని ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ కోఆప్షన్ మెంబరు ఎస్ఏ గఫూర్ అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలో ఆగస్టు 1న ఉదయం 6 నుండి సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛను డబ్బులు అందించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని 17 సచివాలయాల పరిధిలోగల 19 గ్రామ పంచాయతీల్లో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేశారని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. చిన్నవంగలి, పెద్దవంగలి, చింతల చెరువు గ్రామాల్లో జరిగే పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. చాగలమర్రిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు పింఛన్‌లు పంపిణీ చేశారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పింఛన్‌ల పంపిణీ 96 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. దొర్నిపాడు గ్రామంలో టీడీపీ నాయకులు సిద్ధి సత్యనారాయణ, రామచంద్రాపురంలో సర్పంచ్ బొబ్బూరి కృష్ణ, బొబ్బూరి వెంకటస్వామి, చాకరాజు వేములలో టీడీపీ మండల నాయకులు మల్లేశ్వర చౌదరి, లింగుట్ల వెంకట్ నాయుడు, భాగ్యనగరంలో కొత్తపల్లి సురేంద్ర, గుండుపాపలలో కాశీవిశ్వనాథ్‌రెడ్డి పింఛన్ పంపిణీ చేశారు.

రుద్రవరం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ 95.25 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఇంటింటికీ తిరిగి అవ్వతాతలకు, మానసిక వికలాంగులకు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

డోన్(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ ఫలాలు అం దిస్తుందని జనసేన నాయకుడు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సచివాలయ సిబ్బంది ద్వారా పేద లకు పింఛన్ డబ్బులు అందజేశారు.

బేతంచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామ సచివాలయాల సిబ్బంది గురువారం ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేశారు. మండలంలోని సిమెంటునగర్, బేతంచెర్ల, బైటిపేట తదితర గ్రామాల్లో వృద్ధులు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. బైటిపేటలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు లోకేశ్‌గౌడు, కౌన్సిలర్ నంద్యాల మధు పాల్గొన్నారు.

సంజామల: హామీలు అమలుపర్చడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని మండల టీడీపీ ఇన్‌చార్జి బత్తుల వెంకట ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం గిద్దలూరు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంటింటికి పింఛన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అవ్వా తాతలకు పింఛన్ అందజేశారు.

● మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం పింఛన్‌ల పంపిణీ 98 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఉదయం 6గంటలకే ఆయా గ్రామాలకు పంపించి పింఛన్‌ల పంపిణీ ప్రారంభించామన్నారు.

కొలిమిగుండ్ల: తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లె ఆగస్టు నెల సామాజిక పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

● మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సుమారు 97.5శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి వెల్లడించారు. మండలంలో మొత్తం 7133 వివిధ రకాల సామాజిక పింఛన్లు ఉండగా 6943 పింఛన్లు లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో 98.67 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో రఘురాం తెలిపారు. గురువారం మండలంలోని అల్లూరు, మాయలూరు గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. తుడుములదిన్నె డిజిటల్ అసిస్టెంటు మౌలాలి నంద్యాల శాంతిరామ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు తోట సంజమ్మకు అక్కడికే వెళ్లి పింఛన్ అందించారు.



కోవెలకుంట్లలో పింఛన్ ఇస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ కోఆప్షన్ మెంబరు ఎస్ఏ గఫూర్



చాగలమర్రి మండలం చిన్నవంగలిలో పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో





అంకిరెడ్డిపల్లెలో.., దొర్నిపాడు మండలం రామచంద్రాపురంలో..

'ఎస్సీ వర్గీకరణపై తీర్పు హర్షణీయం'

ఉయ్యాలవాడ, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పునిచ్చిందని టీడీపీ మండల సీనియర్ నాయకులు కుడాల నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లా డుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించే హక్కు రాష్ట్రాలకు ఉంటుందని సుప్రీంకోర్టు తీర్పునివ్వ డం హర్షణీయమన్నారు. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ చేస్తే అసెంబ్లీలో తీర్మానించడంతోనే సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించిందన్నారు.

బనగానపల్లె: ఎస్సీ వర్గీకరణకు మొదటి నుంచి సీఎం చంద్రబాబు సహకరించారని టీడీపీ వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు రావడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

చాగలమర్రి: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం చాగలమర్రి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం ప్రకటించి సంబరాలు జరుపుకొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం చంద్రబాబు వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. ఆయన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ వచ్చినందువల్ల సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గాంధీ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మీనారా యణ, రాజు, ప్రకాష్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని టీడీపీ తాలుకా ఉపాధ్యక్షుడు యడవల్లి శ్రీనివాసులు అన్నారు. 2004 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉంటూ వచ్చిందని, ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పునివ్వడం సంతోషకరమని అన్నారు.

ప్యాపిలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయాలని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరంగన్న కోరారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేశారు.

కొలిమిగుండ్ల: మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 30ఏళ్ల ఎమ్మార్పీస్ పోరాటానికి నేడు ఫలితం దక్కిందని ఎమ్మార్పీస్ సీనియర్ నేత నాగేశ్వరరావు మాదిగ అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎమ్మార్పీస్ నాయకులు ఎస్సీ కాలనీ నుండి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేశారు.

ఆళ్లగడ్డ: ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో సంబరాలు జరుపుకొన్నారు. ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు కోర్టు బ్రహ్మం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.



ప్యాపిలిలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



బనగానపల్లెలో టీడీపీ నాయకుడికి కేక్ తినిపిస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న ఎంపీడీవో

అవుకు, ఆగస్టు 1: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో మల్‌రెడ్డి నిర్వాహకులకు సూచిం చారు. గురువారం ఎంఈవో శ్రీధర్‌రావుతో కలసి అవుకు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించి, విద్యా ర్థులకు భోజనాన్ని వడ్డించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఉన్నత ప్రధానోపాధ్యాయుడు శింగయ్య, సీఆర్‌పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కొలిమిగుండ్ల, ఆగస్టు 1: కొలిమిగుండ్ల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరెడ్డి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత 15రోజులుగా ఆయన సెలవు పెట్టి సొంత గ్రామం కోవెలకుంట్ల మండలంలోని పెద్ద కొప్పెర్లలో ఉంటున్నారు. గురువారం ఇంట్లోనే విషద్రావణం సేవించడంతో కు టుంబ సభ్యులు కోవెలకుంట్లకు తరలించి, అక్కడి నుంచి నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని బంధువులు తెలిపారు.

మద్యం పట్టివేత

ఆళ్లగడ్డ, ఆగస్టు 1: ఆళ్లగడ్డ నుంచి రుద్రవరం గ్రామానికి మద్యం సీసాలను తీసుకెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు గురువారం చెప్పారు. నిందితులైన చాకలి రంగయ్య, మందలూరు దస్తగిరి అనే వ్యక్తులు మోటార్ సైకిల్‌పై 138 మద్యం సీసాలు తీసుకెళ్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

'సరసమైన ధరకు నిత్యావసరాలు'

ఆళ్లగడ్డ, ఆగస్టు 1: ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులోని రైతు బజార్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను ఆళ్లగడ్డ మిల్లర్ల అసోసియేషన్ వారు అందిస్తున్నారని పర్యవేక్షణ అధికారి, సీఎస్‌డీటీ శేఖర్‌రెడ్డి గురువారం చెప్పారు. కందిపప్పు కిలో రూ.160, సోనా రకం బియ్యం రూ.46, బెస్ట్ క్వాలిటీ రకం రూ.47కే వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులో చదువుకు దూరం

● స్పందించిన మల్యాల గ్రామ యువకుడు
● పేద విద్యార్థినికి ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్

డోన్(రూరల్), ఆగస్టు 1: డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఆర్థిక ఇబ్బందులతో తన కూతురు స్వప్నను 5వ తరగతి అనంతరం బడి మాన్పించేశాడు. ఈ విషయం తెలుసుకున్న డోన్ మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు నల్లబోతుల సురేష్ ఆ విద్యార్థిని చదువుకు చేయూతను అందించాడు. డోన్ పట్టణంలోని వాసవి పబ్లిక్ స్కూల్ పాఠశాల యజమాన్యంతో మాట్లాడి పేద విద్యార్థిని బాలిక చదువుకు అడ్మిషన్ ఇచ్చాడు. బాలిక చదువుకు అయ్యే ఖర్చు తానే భరాయిస్తానని ప్రకటించాడు.



పేద విద్యార్థినికి అడ్మిషన్ ఇప్పిస్తున్న సురేష్

'విధుల్లో నిర్లక్ష్యం వద్దు'

ఉయ్యాలవాడ, ఆగస్టు 1: ఉపాధి హామీలోని వర్క్ ఫైల్స్ నిర్వహించడంలో నిర్లక్ష్యం వద్దని ఏపీవో రవిప్రకాశ్ ఆదేశించారు. గురువారం ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఏపీవో మాట్లాడుతూ మాట్లాడుతూ 14 అంశాలతో కూడిన వర్క్‌ఫైల్స్‌ను, సెవన్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. 78 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపడుతున్నామన్నారు. ఎస్.కొత్తపల్లె, ఆర్.పాంపల్లె, పెద్దయమ్మనూరు గ్రామాల్లోరోడ్లకిరువైపులా మొక్కలు పెంపడం చేపట్టేందుకు అనుమతులు లభించిందన్నారు. ఉయ్యాలవాడ, పడిగపాడు గ్రామాల్లో బ్లాక్‌ప్లాంటేషన్‌కు 340 మొక్కలు మంజూరయ్యాని అన్నారు.

దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

రుద్రవరం, ఆగస్టు 1: రుద్రవరం గ్రామ సమీపంలో కొలువుదీరిన దొర్వి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి రుద్రవరం గ్రామానికి చెందిన మచ్చ ఓబులయ్య రూ.1,00,116 విరాళం చెక్కును దేవాలయ నిర్వాహకుడు గాంతి శ్రీనివాసులుకు గురువారం అందించారు. దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకరించామని దాత మచ్చఓబులయ్య అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, నరసింహ తదితరులు ఉన్నారు.

రోప్స్ స్కిప్పింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

సంజామల, ఆగస్టు 1: రోప్స్ స్కిప్పింగ్ క్రీడలో సంజామల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శంకర్ గురువారం తెలిపారు. సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న జి.చిన్మయి మొదటి స్థానంలో విజేతగా నిలిచింది. అండర్ - 14 విభాగంలో కె. శృతి మొదటిస్థానం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో ఎం.రుఫియాబీ, 30 సెకండ్ల రోప్స్ స్కిప్పింగ్ స్పీడ్ అండర్ - 12 విభాగంగా రూపా తబస్సుమ్ మొదటిస్థానంలో విజేతగా నిలిచారు. ద్వితీయ స్థానంలో నవీన విజేతగా నిలిచారు. పాఠశాలలో సభ ఏర్పాటు చేసి వీరిని అభినందించారు. ఉపాధ్యాయులు అరుణ, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

వ్యక్తులపై కేసు నమోదు

ఆళ్లగడ్డ, ఆగస్టు 1: ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సుశిత్ అనే వ్యక్తిని కత్తితో బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు గురువారం చెప్పారు. మహేశ్వరరెడ్డి, సందీప్, రాజు కత్తితో బెదిరించారని సుశిత్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్యాంకాక్ నుంచి మధుకుమార్‌ను తీసుకువస్తామని హామీ

కిడ్నాప్ వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే కోట్ల

డోన్, ఆగస్టు 1: బ్యాంకాక్‌లోని థాయ్‌ల్యాండ్‌లో కిడ్నాప్‌కు గురైన డోన్ మండలంలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన మధుకుమార్‌ను క్షేమంగా ఇండియాకు తీసుకువస్తామని సీఎం చంద్రబాబు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి హామీ ఇచ్చారు. గురువారం శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును డోన్ ఎమ్మెల్యే కోట్ల మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో కిడ్నాప్‌కు గురైన మధుకుమార్ వ్యవహారాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. కిడ్నాప్‌కు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు థాయ్‌లాండ్‌లో కిడ్నాప్‌కు గురైన మధుబాబును క్షేమంగా ఇండియాకు తీసుకువచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే కోట్లకు హామీ ఇచ్చారు.



మధుకుమార్ కిడ్నాప్‌ను సీఎంకు వివరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

చంద్రబాబును కలిసిన డోన్ నాయకులు

డోన్, ఆగస్టు 1: శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్న సంకల్పంతో పని చేస్తున్నారని అన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

కేజీబీవీ పాఠశాలపై విచారణ జరపాలి

బేతంచెర్ల, ఆగస్టు 1: బేతంచెర్ల పట్టణ శివారులోని బనగానపల్లె రహదారిలో ఉన్న కేజీబీవీ పాఠశాలపై ఉన్నత స్థాయి కమిటీతో సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ శివారులోని బనగానపల్లె రహదారిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలపై జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి కమిటీ వేసి పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకి వినతి పత్రం అందజేశారు.

తలిదండ్రులు బాధ్యత వహించాలి: ఎంఈవో

కొలిమిగుండ్ల, ఆగస్టు 1: విద్యార్థులను పాఠశాలలకు పంపడంతోపాటు, వారి చదువుపై తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం అన్నారు. గురువారం మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామంలో ఇటీవల గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు గిరిశ్‌నాయక్, రజితకుమారిలను ఎంఈవో అబ్దుల్‌కలాం, గ్రామ టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

హుండీ చోరీ

డోన్(రూరల్), ఆగస్టు 1: డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామ సమీపంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీలోని డబ్బులు దొంగిలించారు. ఆలయ తలుపులు పగులకొట్టి గుడి లోపలకి ప్రవేశించి హుండీ తాళాలు తీసి భక్తులు వేసిన కానుకలు, డబ్బులను దొంగతనం చేశారు. వీటిపై ఆలయ ధర్మకర్త ఆలా మోహన్ రెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

'తల్లిపాలు బిడ్డకు అమృతం'

చాగలమర్రి, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిదని వైద్యురాలు డాక్టర్ అంజలి అరు. గురువారం చాగలమర్రి గ్రామంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎం లక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్ మాబుచాను, పాల్గొన్నారు.

రుద్రవరం: తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. గురువారం రుద్రవరంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజరు మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు గంటలోపు తల్లిపాలు ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: తల్లిపాలతో చంటిబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఉయ్యాలవాడ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి అపర్ణ తెలిపారు. గురువారం స్థానిక వైద్యశాలలో వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశా రు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు దీప్తి, ఎంపీహెచ్‌ఈవో దస్తగిరి, లక్ష్మీదేవి పాల్గొన్నా రు.

అవుకు: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటుందని మంగంపేట సచివాలయం ఎంఎల్‌హెచ్‌పీ మాధురి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పోస్టర్‌లను విడుదల చేశారు. ఎంపీటీసీ బాలసుబ్బమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త శకుంతలమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ బనగానపల్లె ప్రాజెక్ట్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం కొలిమిగుండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను, అవశ్యకతను మహిళలకు వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

డోన్(రూరల్): మండలంలోని ధర్మవరం గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిం చారు. అంగన్‌వాడీ కార్యకర్త జులైఖ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమని అన్నారు.

బనగానపల్లె: తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా అందించాలని ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ శివశంకరుడు అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా టంగుటూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు.



ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న వైద్యురాలు అపర్ణ